క్లుప్తంగా...

తెలంగాణ పథకాలను దేశవ్యాప్తంగా అమలు చేయాలి

సుల్తాన్‌బజార్: తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశవ్యాప్తంగా అమలు చేయాలని, దేశ ప్రజలందరికీ ఉచిత వైద్యం అందించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న హైదరాబాద్‌లో నిరాహార దీక్ష చేపడుతున్నట్లు సమాచార హక్కు పరిరక్షణ సమితి జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు తెలిపారు. గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో పేద, మధ్య తరగతి వారు తమ సంపాదనలో ఎక్కువ శాతం వైద్యం, విద్యకే ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో ప్రజలు అప్పులపాలై ఆర్థికంగా చితికి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని భారతదేశంలో ఉన్న ప్రజలందరికీ ఉచితంగా వైద్యం, విద్య అందించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఉషారాణి హైదరాబాద్ జిల్లా కన్వీనర్ శ్రీనివాస్, ఎస్‌జె. ఉమాకాంత్, సాయికుమార్ పాల్గొన్నారు.

యాదవుల ధర్నాకు సంఘీభావం



మాట్లాడుతున్న గడ్డం శ్రీనివాస్ యాదవ్

అబిడ్స్: గొల్లకురుమలను, మంత్రి తలసానిని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా యాదవ సంఘం నిర్వహించిన ధర్నాకు గోషామహల్ బీఆర్‌ఎస్ నాయకుడు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ సంఘీభావం తెలిపారు. గురువారం గోషామహల్ నుంచి అబిడ్స్ మీదుగా బషీర్‌బాగ్, ఇందిరాపార్కు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ పొడవునా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రేవంత్‌రెడ్డికి యాదవులు అంతా తమ సత్తా చూపుతామన్నారు. క్షమాపణ చెప్పకుంటే తగిన మూల్యం చెల్లించుకుంటాడని ఆయన అన్నారు.

ముగిసిన సంగీత వైభవం



నాంపల్లి: లక్ష్మణాచారి మెమోరియల్ కాలేజ్ ఆఫ్ మ్యూజిక్ 15వ వార్షికోత్సవంలో భాగంగా తలపెట్టిన మూడు రోజుల కార్యక్రమాలు బుధవారం రాత్రి ముగిశాయి. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ కళా మందిరం వేదికగా వైభవంగా సాగాయి. విద్యార్థులు అనేక కీర్తనలు గానం చేశారు. మహతి రాగ వర్ణం, గమనశ్రమ తిల్లానా ఆకట్టుకున్నాయి. శశికళ ఆధ్వర్యంలో రూపొందించిన సింధు భైరవి రాగ వైభవం వీడియోను సినీ గాయకులు ఎస్పీ చరణ్ ఆవిష్కరించి ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సాహితీవేత్తలు ఓలేటి పార్వతీశం, ఉదయ్ శంకర్ హాజరయ్యారు. శశికళ, హిమబిందు చేస్తున్న కళా సేవను వారు ఈ సందర్భంగా శ్లాఘించారు.

ప్రజా సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట



గోల్కొండ: సంక్షేమ పథకాల అమలులో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి తిరుగులేదని తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ బి.వినోద్‌కుమార్ అన్నారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు మాజీ సభ్యుడు వహీద్ అహ్మద్ గురువారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ.. పేద బడుగు వర్గాల ప్రజలతో పాటు వెనుకబడిన తరగతులు మైనార్టీల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేశారని, ముఖ్యంగా నిరుద్యోగ యువత స్వయం ఉపాధి కోసం రాష్ట్రంలో ఎన్నో పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయని ఆయన అన్నారు. వృద్ధ మహిళలు, ఒంటరి మహిళలకు ఆసరా పెన్షన్లు అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సయ్యద్ అక్బర్ హుస్సేన్, సయ్యద్ ఖిదర్ పాషాఖాద్రి తదితరులున్నారు.

పార్లమెంటుకు బీఆర్.అంబేడ్కర్ పేరు పెట్టాలి

గన్‌ఫౌండ్రీ: పార్లమెంటుకు డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ పేరు పెట్టాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కో ఆర్డినేటర్ పద్మారావు కోరారు. ఈ మేరకు గురువారం ఆదర్శ్‌నగర్‌లోని అఖిల భారత అంబేడ్కర్ యువజన సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్లమెంటుకు అంబేడ్కర్ పేరు పెట్టాలని, దేశవ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజలు డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రధాని నరేంద్ర మోదీ స్పందించకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా పార్లమెంటు భవనాన్ని భారత రాష్ట్రపతితో ప్రారంభింపచేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అఖిలభారత అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినయ్‌కుమార్, పుణ్య భానుప్రకాష్, ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం

- పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో పేరుకుపోతున్న చెత్తాచెదారం
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు





ఖబూతర్‌ఖానా దూద్‌బౌలి మహరాజ్‌గంజ్ ప్రాంతంలో పేరుకుపోయిన చెత్తాచెదారం

దూద్‌బౌలి: జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్లక్ష్యం, పారిశుద్ధ్య కార్మికుల అలసత్వంతో పాతబస్తీలోని దూద్‌బౌలి పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించకపోవడంతో కుప్పలు తెప్పలుగా చెత్తాచెదారం దర్శనమిస్తున్నాయి. దూద్‌బౌలి, మహారాజ్‌గంజ్ పోచమ్మ దేవాలయం, కామాటిపురా, మామిడికాయల మఠం, వీరాసింగ్ బంగ్లా, రాయల్ స్కూల్ తదితర ప్రాంతాల్లో చెత్త కుప్పలు తెప్పలుగా దర్శనమివ్వడంతో ఈ రహదారులు ద్వారా వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెత్తకుప్పలతో కూడిన నీరు ఇళ్లల్లోకి చేరడంతో అనారోగ్యాలకు గురవుతున్నామని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై స్థానికులు శేఖర్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, దేవేందర్ మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని.. పారిశుద్ధ్య కార్మికులు ఇటు వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని వాపోయారు. దీనిపై వెంటనే డీసీఎం స్పందించి తమ ప్రాంతంలో పర్యటించి పారిశుద్ధ్య పనులను చేపట్టాలని కోరారు.

పార్కుల అభివృద్ధికి కృషి



సాలార్జంగ్ కాలనీ పార్కులో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో పార్కుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన నానల్‌నగర్ డివిజన్‌లోని సాలర్జంగ్ కాలనీలో ఉన్న పార్కులను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలోని పార్క్-2లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల పరిరక్షణ వాటిలోని మొక్కలు, చెట్ల పెంపకం బాధ్యతలు కాలనీవారే చూసుకోవాలన్నారు. కార్వాన్ నియోజకవర్గంలోని కార్వాన్, నానల్‌నగర్, లంగర్‌హౌస్ డివిజన్లలో అత్యధిక పార్కులు ఉన్నాయన్నారు. అల్ హస్నాత్ కాలనీలో పార్కుకు గతంలో నగరంలోనే అత్యంత అభివృద్ధి చెందిన పార్కుగా అవార్డులు వచ్చాయని ఆయన అన్నారు. అయితే కొన్ని కాలనీలవారు పార్కుల అభివృద్ధి విషయాన్ని పట్టించుకోవడంలేదని, మరికొన్ని పార్కులు పిల్లలు ఆడుకోవడానికి పనికిరాకుండా పోతున్నాయని, దీనికి ఆ కాలనీల వారి నిర్లక్ష్యమే ఆయన అన్నారు. కాలనీ సంక్షేమ సంఘం వారు పార్కుల అభివృద్ధిపై తన వద్దకు వచ్చి చర్చిస్తే తాను వాటి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, బల్దియా ఉద్యానవనశాఖ మేనేజర్ భూమా, కాలనీ నాయకులు డాక్టర్ నియాజ్ అహ్మద్‌ఖాన్, మజ్లిస్ నాయకులు తదితరులున్నారు.

చదరంగ క్రీడాకారులకు ప్రోత్సాహం



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చదరంగ క్రీడాకారులకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తుందని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఆంజనేయగౌడ్ అన్నారు. గురువారం ఎల్బీస్టేడియంలో తెలంగాణ చెస్ అసోసియేషన్, స్పోర్ట్స్ లోకల్ ఏరియా నెటవర్క్స్ ఆధ్వర్యంలో జులై 21వ తేదీ నుంచి నిర్వహిస్తున్న మొదటి అంతర్జాతీయ ఓపెన్ ఫిడె చెస్ టోర్నమెంట్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ ప్రతినిధులు చంద్రమౌళి, నవీన్‌నాయక్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కట్టా మైసమ్మ ఆలయంలో చోరీ

నాంపల్లి: కోమటికుంట కట్టా మైసమ్మ ఆలయంలో గురువారం తెల్లవారుజామున దొంగలు పడ్డారు. హుండీలోని నగదు, గర్భగుడిలోని అమ్మవారి విగ్రహానికి ఉన్న బంగారం, వెండి ఆభరణాలను దోచుకెళ్లారు. ఈ ఘటన హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, ఆలయ కమిటీ చైర్మన్ సూర్యకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆలయానికి ప్రతిరోజూ పూజారి ఉదయాన్నే వచ్చి పూజలు నిర్వహించేవారన్నారు. రోజు మాదిరిగానే పూజారి గురువారం ఉదయాన్నే ఆలయానికి వచ్చి చూడగా తాళాలు పగిలిపోయి ఉన్నాయి. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మరో నెల రోజుల్లో బోనాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆలయంలో దొంగతనం జరగడం చర్చాంశనీయంగా మారింది. ఆలయంలోని అమ్మవారి చేయి, త్రిశూలం పూర్తిగా దెబ్బతిన్నాయి. అమ్మవారికి చెందిన 7 తులాల వెండి, ఒక తులం బంగారం ఆభరణాలు దోచుకెళ్లినట్లు సూర్యకుమార్ తెలిపారు. ఆలయం హుండీలో రూ.80 వేల వరకు నగదు ఉంటుందని వివరించారు.

సీసీ పుటేజీకి దొరికిన దొంగ..

రంగంలోకి దిగిన పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించారు. సీసీ పుటేజీని పరిశీలించాక తాండూరుకు చెందిన సునీల్ చౌహాన్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పోలీసులకు చిక్కిన వ్యక్తి మద్యం మత్తులో దొంగతనానికి పాల్పడినట్లు తెలుస్తోంది. గతంలోనూ నేరాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. దొంగతనం చేసినట్లు ఒప్పుకోవడంతో సునీల్ చౌహాన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తలించారు.

యువకుడి ఆత్మహత్య

సంతోష్‌నగర్: యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై లింగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. చంపాపేట్ సుల్తాన్ అల్వా ప్రాంతానికి చెందిన చించెట్టి బాబు రావు (24) కార్మికుడిగా పని చేస్తున్నాడు. బాబు రావు తల్లిదండ్రులు తొమ్మిదేళ్ల క్రితం చనిపోయాడు. బాబురావుకు ఉన్న నలుగురు అక్కాచెల్లెల వివాహమైంది. బాబురావు ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. జీవితంపై విరక్తి చెంది. గురువారం మధ్యాహ్నం సమయంలో బాబురావు ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం బాబురావు బావ ప్రవీణ్‌కుమార్‌కు సైతం సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకొని చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయాల అభివృద్ధికి సహకారం



బీజేపీ నాయకుడు అమర్‌సింగ్‌కు ఆహ్వాన పత్రం అందజేస్తున్న దృశ్యం

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి తన సహకారం ఎప్పుడూ ఉంటుందని కార్వాన్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి టి.అమర్ సింగ్ అన్నారు. నానల్‌నగర్ డివిజన్ తిరుపల్లిగడ్డలోని కోవెల రంగనాయకస్వామి ఆలయ ప్రాంగణంలో జరుగనున్న దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాల ఆహ్వాన పత్రాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ మాజీ సభ్యులు గురువారం ఆయనను కలిసి అందజేశారు. ఈ సందర్భంగా అమర్ సింగ్ మాట్లాడుతూ.. తెలంగాణలో బీఆర్‌ఎస్ పాలనలో ఆలయాల అభివృద్ధి అటకెక్కిందన్నారు. బీజేపీ హిందువుల మనోభావాలకు అత్యంత ప్రాధాన్యమిస్తూ వారి ప్రార్థనా స్థలాలు, ఆలయాల అభివృద్ధి, వాటి పురనరుద్ధరణకు కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జనార్దన్, నర్సింహ తదితరులున్నారు.

కాలిన ట్రాన్స్‌ఫార్మర్.. తప్పిన ప్రమాదం

సాక్షి, సిటీబ్యూరో: ఆయిల్ లీకేజీ, నిర్వహణ లోపానికి తోడు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ భారీగా చెత్తను డంప్ చేయడంతో షార్ట్ సర్క్యూట్ తలెత్తి ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. గురువారం మధ్యాహ్నం అంతా చూస్తుండగానే ఫ్యూజ్ బాక్స్ సహా ఫిల్లర్‌పై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ మంటల్లో కాలిపోయింది. ఫలితంగా ఆ ఫీడర్ పరిధిలోని గృహ, వాణిజ్య సముదాయాలకు రోజంతా కరెంట్ సరఫరా నిలిచిపోయింది. బేగంబజార్‌లోని ఫీల్‌ఖానా మసీదు పక్కన డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. డీటీఆర్ నుంచి ఆయిల్ లీకేజీకి తోడు సామర్థ్యానికి మించి విద్యుత్ డిమాండ్ నమోదవడంతో ఫ్యూజ్‌బాక్స్ నుంచి ఒక్క సారిగా మంటలు చెలరేగి, కింద ఉన్న చెత్తకు అంటుకున్నాయి. ఆపై ఫ్యూజ్ బాక్స్ సహా డీటీఆర్ కాలిపోయింది. గతంలో కూడా ఇలాగే ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటులు అంటున్నట్లు తెలిసింది.

ముగ్గురు పిల్లలతో గృహిణి అదృశ్యం



ఆస్మా బేగం (ఫైల్)

సంతోష్‌నగర్: ముగ్గురు పిల్లలతో కలిసి ఓ గృహిణి అదృశ్యమైన ఘటన కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై హిమారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కంచన్‌బాగ్ హఫీజ్‌బాబానగర్‌కు చెందిన మహ్మద్ అన్సార్, ఆస్మా బేగం (30) దంపతులు. వీరికి ముగ్గురు పిల్లలు సంతానం. బుధవారం రాత్రి దంపతుల మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. అన్సార్ పని నిమిత్తం బయటికి వెళ్లగా పిల్లలకు తాయాత్తు కటిస్తానని ఆస్మా బేగం మహ్మద్ అమీర్ (10), మహ్మద్ ఆమన్ (7), మహ్మద్ అద్నాన్ (1)లతో కలిసి ఇంట్లో నుంచి బయటికి వెళ్లింది. అనంతరం తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆందోళన చెందిన భర్త మహ్మద్ అన్సార్ స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో తన భార్య, పిల్లలు కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గొల్లకురుమల వృత్తిని కించపరచడం దారుణం



ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్ తదితరులు

అబిడ్స్: గొల్లకురుమల వృత్తిని కించపరచడం దారుణమని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. గొల్లకురుమల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేసిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి తగిన గుణపాఠం చెబుతామన్నారు. తెలంగాణ యాదవ సంఘం ఇందిరాపార్కు వద్ద ఏర్పాటు చేసిన ధర్నాకు అబిడ్స్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయం నుంచి భారీ ఎత్తున ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా అబిడ్స్ నుంచి ర్యాలీ ప్రారంభించి ప్రసంగించారు. రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పడంతో రాష్ట్రవ్యాప్తంగా అడ్డుకుంటామన్నారు. గొల్లకురుమల మనోభావాలను దెబ్బతీసే విధంగా, మంత్రి శ్రీనివాస్ యాదవ్‌పై కూడా అనుచిత వ్యాఖ్యలు చేసిన రేవంత్‌రెడ్డి భారీ మూల్యం చెల్లించుకుంటారని ఆయన అన్నారు.

పాఠశాలలను కళావేదికలుగా తీర్చిదిద్దండి



చిన్నారికి సర్టిఫికెట్‌ను అందజేస్తున్న దృశ్యం

సుల్తాన్‌బజార్: తెలంగాణ సారస్వత పరిషత్తు హైదరాబాద్‌లో నిర్వహించిన రెండు రోజుల బాల సాహిత్య సమ్మేళనం గురువారం ముగిసింది. విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తులను వెలికితీయడం కోసం పాఠశాలలను కళావేదికలుగా రూపొందించేందుకు కృషి చేయాలని రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కోరుతూ సమ్మేళనం తీర్మానించింది. పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య నిర్వహణలో రోజంతా జరిగిన వివిధ సదస్సుల్లో బాల రచయితలు, రచయిత్రులు, బాల సాహితీ వేత్తలు, బాలల సాహితీ కళా సృజనలో స్వచ్ఛందంగా కృషి చేస్తున్న తెలుగు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యల్లో పాల్గొన్నారు. డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ అధ్యక్షతన జరిగిన సదస్సులో ప్రముఖ విద్వాంసులు కృష్ణమోహన్, కళా కృష్ణ డాక్టర్ విజయ్‌కుమార్జీ, వెంకటేశ్వర్లు ఆసక్తికరంగా ప్రసంగాలు చేశారు. డాక్టర్ నిత్యానందరావు అధ్యక్షతన పాఠశాలలు బాల సాహిత్య వికాస కేంద్రాలు అనే అంశంపై జరిగిన చర్చాగోష్ఠిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి 25 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ.. డాక్టర్ కేవీ వరప్రసాద్‌రెడ్డి సౌజన్యంతో నిర్వహించిన బాల సాహిత్య సమ్మేళనం ఫలవంతంగా జరిగిందని సంతృప్తి వ్యక్తం చేశారు. వేదకుమార్, వసుంధర, సురవరం కృష్ణవర్ధన్‌రెడ్డి, ఉషారమణి పాల్గొన్నారు.

28 నుంచి ఉచిత యాక్టింగ్ వర్క్‌షాప్

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో గ్లోబల్ ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా సర్వీసెస్ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీ నుంచి రవీంద్రభారతిలో ఉచిత ప్రొడక్షన్ ఓరియంటెడ్ థియేటర్ యాక్టింగ్ వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు అల్ల సతీష్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐదేళ్ల నుంచి 50 ఏళ్ల వయస్సుగల ఔత్సాహిక నటీనటులు ఈనెల 27న రవీంద్రభారతిలో జరిగే ఆడిషన్లకు హాజరుకావాలని పేర్కొన్నారు. 95735 85137లో సంప్రదించాలని సూచించారు.

నేడు సాలార్‌జంగ్ మ్యూజియంలో బహుమతుల ప్రదానం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పాండుయాదవ్, మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ

చార్మినార్: సాలార్‌జంగ్ మ్యూజియంలో ఈనెల 26న సాయంత్రం 4 గంటలకు 'ఖేలో భారత్ జీతో భాగ్యనగర్' స్పోర్ట్స్ ఫెస్టివల్ బహుమతుల ప్రదానం ఉంటుందని రాష్ట్ర బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ తెలిపారు. కార్యక్రమం సందర్భంగా గురువారం సాయంత్రం బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు వి.పాండుయాదవ్, పాపరావు, ఓంప్రకాశ్, మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ సాలార్‌జంగ్ మ్యూజియంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యఅతిథులుగా గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, మైనార్టీ జాతీయ కమిషన్ సభ్యులు సయ్యద్ షెహజాదీ హాజరవుతారన్నారు. రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, తెలంగాణ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ మాట్లాడుతూ.. క్రీడా పోటీల్లో భాగంగా క్రికెట్, ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్‌లో పోటీలు నిర్వహించారన్నారు. హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలోని యువతతో పాటు జర్నలిస్టులకు, పార్టీ సభ్యులకు కూడా పోటీలు నిర్వహించనున్నామన్నారు.

ఆలయ విస్తరణ పనులు ప్రారంభమవుతుండడం హర్షణీయం



లాల్‌దర్వాజా ఆలయంలో అర్చన నిర్వహిస్తున్న ఫోర్‌మెన్ కమిటీ చైర్మన్లు

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయం విస్తరణ పనులు త్వరలోనే ప్రారంభం కానుండడాన్ని పురస్కరించుకొని ఆలయ ఫోర్‌మెన్ కమిటీ సభ్యులు గురువారం అర్చన నిర్వహించారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన మాటను నెరవేరుస్తున్న సందర్భంగా ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ అమ్మవారి ఆశీస్సులు ముఖ్యమంత్రికి ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నారు. ఫోర్‌మెన్ కమిటీ చైర్మన్లుగా తాము శివకుమార్‌యాదవ్, శీర రాజ్‌కుమార్, పోసాని సురేందర్ ముదిరాజ్, బద్రీనాథ్‌గౌడ్ ఎన్నికై నప్పటి నుంచి ఎలాంటి వివాదాలకు తావులేకుండా ఆలయ విస్తరణ కోసం ఎప్పటికప్పుడు ప్రభుత్వం, స్థానికులతో సంప్రదింపులు జరపడంతో రెవెన్యూ అధికారులు స్థల సేకరణ పనులు సైతం బుధవారం నుంచి ప్రారంభించారని వారు పేర్కొన్నారు. ఈ ఏడాది బోనాల ఉత్సవాలకు సీఎం కేసీఆర్‌ను ఆహ్వానించనున్నామన్నారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పర్యవేక్షణలో ఆలయ విస్తరణ పనులు ముందుకు సాగుతున్నాయన్నారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ విష్ణుగౌ, పోసాని సదానంద్ ముదిరాజ్, రంగ శ్రీకాంత్ గౌడ్, తిరుపతి నాగరాజు, రంగ రణధీర్ గౌడ్ పాల్గొన్నారు.

మండలి బుద్ధ ప్రసాద్‌కు ఎన్టీఆర్ భాషా సేవా పురస్కారం



మండలి బుద్ధ ప్రసాద్‌కు పురస్కారాన్ని అందజేస్తున్న దృశ్యం

నాంపల్లి: కిన్నెర ఆర్ట్ థియేటర్స్-నృత్య కిన్నెర సంస్థల సంయుక్తాధ్వర్యంలో ఏపీ పూర్వ ముఖ్యమంత్రి, నటరత్న డాక్టర్ ఎన్టీ రామారావు శత జయంతి మహోత్సవాల ముగింపు సందర్భంగా ఏపీ శాసన సభ పూర్వ ఉప సభాపతి డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్‌కు కిన్నెర-ఎన్టీఆర్ భాషా సేవా పురస్కారం బహూకరణ జరిగింది. గురువారం రాత్రి నాంపల్లి పబ్లిక్‌గార్డెన్స్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళామందిరంలో ఈ కార్యక్రమం జరిగింది. తెలంగాణ రాష్ట్ర సలహాదారు కేవీ రమణాచారి అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా భారత పూర్వ ఉప రాష్ట్రపతి డాక్టర్ ముప్పవరపు వెంకయ్య నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్‌కు కిన్నెర-ఎన్టీఆర్ భాషా సేవా పురస్కారాన్ని అందజేసి సత్కరించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జి.భవానీప్రసాద్, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ.సుబ్రహ్మణ్యం, కిన్నెర కార్యదర్శి మద్దాళి రఘురామ్ పాల్గొన్నారు.

క్రీడాకారుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



మహ్మద్ హుసముద్దీన్‌ను సత్కరించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్, డాక్టర్ ముజీబ్ హుస్సేని

అబిడ్స్: క్రీడాకారుల అభ్యున్నతికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్నివిధాల సహకరిస్తుందన్నారు. బాక్సింగ్‌లో పలు విజయాలు సాధించిన మహ్మద్ హుసముద్దీన్‌ను టీఎన్జీఓ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. క్రీడాకారులకు అన్ని విధాల అండగా ఉంటామన్నారు. డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ.. క్రీడాకారులు విశ్వవ్యాప్తంగా తెలంగాణ ఖ్యాతిని చాటే విధంగా కృషి చేస్తున్నారన్నారు. క్రీడాకారులకు టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో ఎప్పుడూ సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సందీప్‌కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై దాడి.. వ్యక్తికి జైలు శిక్ష

డబీర్‌పురా: యువకుడిపై దాడికి పాల్పడిన కేసులో ఓ వ్యక్తికి నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్‌రావు ఐదు రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. డబీర్‌పురా పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. డబీర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలోని చంచల్‌గూడ కొత్త రోడ్డు నుంచి మహ్మద్ ఇంతియాజ్ అనే వ్యక్తి ఈనెల 24న నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో షేక్ షాకీర్ అనే వ్యక్తి మహ్మద్ ఇంతియాజ్‌ను అనవసరంగా అడ్డుకొని అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడికి పాల్పడ్డాడు. దీనిపై మహ్మద్ ఇంతియాజ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు షేక్ షాకేర్‌ను అరెస్ట్ చేసి ఈ-పెటట్టీ కేసు నమోదు చేసుకొని గురువారం కోర్టులో హాజరుపరిచారు. దీంతో విచారణ చేపట్టిన నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్‌రావు నిందితునికి ఐదు రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. దీంతో నిందితుడు షేక్ షాకేర్‌ను అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

ఫ్రీ హోల్డ్ ల్యాండ్ చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు



నాంపల్లి: మహవీర్ ఆస్పత్రికి ప్రభుత్వం ఇచ్చిన భూమిని ఫ్రీ హోల్డ్ చేసిన సీఎం కేసీఆర్‌కు మేనేజింగ్ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం సాయంత్రం ఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మేనేజింగ్ కమిటీ చైర్మన్ మహేంద్రా రంకా వైస్ చైర్మన్ సునీల్ కపాడియా, మేనేజింగ్ ట్రస్టీ సునీల్ పహాడే, కోశాధికారి సుశీల్ పంచేటితో కలిసి ప్రసంగించారు. 1975లో జి.ఓ నెం. 1095 ద్వారా తమకు కేటాయించిన భూమిని ప్రభుత్వం ఇప్పుడు ఫ్రీ హోల్డ్ మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇది నామమాత్రంగా సంవత్సరానికి రూ.12 చొప్పన మూడున్నర ఎకరాల భూమిని 30 ఏళ్ల పాటు లీజుకు తీసుకున్నారు. ఇప్పుడు మహవీర్ ఆస్పత్రికి ఫ్రీ హోల్డ్ ల్యాండ్‌గా మార్చేందుకు సీఎం కేసీఆర్ ఆమోదం తెలపడం సంతోషంగా ఉందన్నారు. మరో వారంలో జి.ఓ విడుదల అయ్యే అవకాశం ఉందని ఎంహెచ్‌ఆర్‌సీకి చెందిన భగవాన్ మహవీర్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ మహేంద్ర రంకా తెలియజేశారు.

బీఆర్‌ఎస్ పాలనలో రైతులకు అన్యాయం

గోల్కొండ: తెలంగాణలో బీఆర్‌ఎస్ పాలనలో రైతులకు అన్యాయం జరుగుతుందని గోల్కొండ జిల్లా కిసాన్ మోర్చా నాయకులు గోదాలక్ష్మీకాంత్ యాదవ్ అన్నారు. తమ ఉత్పత్తులకు సరైన ధర లేక తెలంగాణ రైతులు విలవిలలాడుతున్నారని, అకాల వర్షాలు, తుఫానులకు పంటలు దెబ్బతిన్నాయన్నారు. ధాన్యం కొనుగోళ్లలో సైతం ప్రభుత్వం రైతులను దోచుకుంటుందని ఆయన దుయ్యబట్టారు. ఆర్థికంగా చితికిపోయిన రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, అన్నదాతల ఆత్మహత్యలు బీఆర్‌ఎస్ పెద్దలు పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు.